

సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న లోకేశ్, అచ్చెన్నాయుడు పుల్లారావు తదితరులు.



- అధికారపార్టీ ప్రచార పిచ్చికి ఉద్యోగులు బలి
- స్వామి కార్యంతోపాటు స్వకార్యానికీ తప్పని ఈకేవైసీ
- ప్రతి పథకానికి ఈ కేవైసీ కావాలంటూ ఆదేశాలు
- 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో లబ్ధిదారులకు లేఖలు
- దానికీ ఈ కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఛీ.. పొమ్మంటున్న లబ్ధిదారులు
- పలుచోట్ల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై దాడులు

అడ్డగోలు వాడకం!

గుంటూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ఒక వలంటీర్ ఆన్‌లైన్ ఆధార్ ఈ కేవైసీ కోసం ఒకరి ఫోనుకు ఓటీపీ పంపింది. ఆ ఓటీపీ చెప్పాలని ఆ నెంబరుకు కాల్ చేసింది. కాల్ లిఫ్ట్ చేసిన ఆ ఇంటి మహిళ తన భర్తకు పదేపదే ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ వలంటీర్‌తో గొడవకు దిగింది. వివాహేతర సంబంధం వుందంటూ ఆరోపణలు చేసింది. దీనిపై పంచాయతీ కార్యదర్శికి వలంటీర్ ఫిర్యాదు చేసింది. అతడు పట్టించుకోకపోవడంతో ఆ వలంటీర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయింది. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. ఈ కేవైసీల కోసం పదేపదే ఫోన్లు చేయడం, వేలిముద్రల కోసం పదేపదే ఇళ్లకు వెళ్లడం వంటి కారణాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక మూల ఇలాంటి ఘటనలు జరుగుతూనే వున్నాయి.

అవమానాల పాలవుతున్న ఉద్యోగులు, వలంటీర్లు

అధికార వైసీపీ ప్రచార పిచ్చి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు లేనిపోని తిప్పలు తెస్తోంది. ఉద్యోగం, ఉపాధి మాట ఎలా వున్నా సమాజం లో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ అడ్డగోలు వాడకం కారణంగా వారికి అవ మానాలే మిగులు తున్నాయి. సమాజంలో అనేక ఛీత్కారాలకు గురవుతున్నారు. వారి వ్యక్తిగత జీవితంపైనే ముద్ర వేయించుకునే పరిస్థితి వస్తోంది. సంక్షేమ పథకాలతోపాటు సొంత ప్రచారానికి కూడా వారిని వాడేస్తుండడంతో ప్రజల్లో వలంటీర్లు, సచివాల య ఉద్యోగులంటే చీత్కార భావం కలు గుతోంది.

స్వకార్యానికి కూడా ఈ- కేవైసీ


సంక్షేమ పథకాల పేరుతో పదుల సంఖ్యలో ఈ- కేవైసీ చేయిస్తున్న ప్రభుత్వం అవి చాలవన్నట్లు సొంత ప్రచారానికి కూడా ఈ కేవైసీ చేయించాలని డిమాండ్ చేస్తోంది. 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో ముఖ్యమంత్రి పేరుతో వచ్చిన లేఖను లబ్ధిదారుల ఇంటికి చేర్చి వారితో ఈ కేవైసీ చేయించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై లబ్ధిదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు పొందిన సంక్షేమ ఫలాలతో ఎలాంటి సంబంధం లేని తప్పుడు లెక్కలతో ఈ లేఖలు ఉండడంతో లబ్ధిదారులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఛీ.. పొమ్మంటున్నారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులతోపాటు, అధికార వైసీపీ నేతలు కూడా వలంటీర్లు, ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారులను అదేస్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు వారికి ఎదురు తిరిగుతున్నారు. పలుచోట్ల దాడులకు కూడా దిగుతున్నారని వలంటీర్లు వాపోతున్నారు. ఇదిలా వుండగా, రేపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత తమ పరిస్థితి ఏమిటా.. అని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి పథకానికి ఈ- కేవైసీ

ప్రభుత్వం తాను అమలు చేస్తున్నానన్న ప్రతి పథకానికి ఈ కేవైసీని తప్పనిసరి చేసింది. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసినందుకు, ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేసినందుకు, ఇళ్ల పట్టాలు పంపిణీకి, పాలవెల్లువ సర్వేకు, క్యాస్ట్ సర్వేకు.. ఇలా ప్రతిదానికీ ఈ కేవైసీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇది క్షేత్రస్థాయిలో పనిచేసే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అనేక సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ కేవైసీ వేలిముద్రల కోసం వలంటీర్లు ఇళ్లకు వెళుతుండడంపై గృహిణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటీపీ ద్వారా ఆన్‌లైన్ ఈ కేవైసీ కోసం వలంటీర్లు సంబంధిత మొబైల్ నెంబర్లకు ఓటీపీలు పంపుతున్నారు. అవి తెలుసుకోవడానికి పదే పదే ఫోన్లు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పదే పదే ఇళ్లకు వెళ్లడం, ఫోన్లు చేయడంపై వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారేమీ పట్టించుకోవడం లేదు. మాకు అవన్నీ అనవసరం ఈ కేవైసీ కావాల్సిందేనని పట్టు పడుతున్నారు. దీంతో వారు ఇరువైపులా నలిగిపోతున్నారు.

ఇవ్వని పథకాలు ఇచ్చినట్లుగా..

వలంటీర్లపై మండిపడుతున్న ప్రజలు



గడప గడపకు సంక్షేమం పేరుతో స్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్టు ఇచ్చిన తప్పుడు పత్రం

ప్రత్తిపాడు: మా ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి వచ్చిన లబ్ధి ఇది అంటూ ఇస్తున్న పత్రాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రెండు రోజులుగా వలంటీర్లు ఇంటింటికి వచ్చి లబ్ధి వివరాలతో కూడిన పత్రాలను కుటుంబ యజమానులకు అందజేసి వారి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అయితే ఆయా పత్రాలు చూసుకున్న చాలామంది తమకు ఆ పథకాల లబ్ధి అందలేదని వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండానే స్థలాలు ఇచ్చినట్లు, అమ్మఒడి ఒక్కసారి పడితే రెండు సార్లు అందుకున్నట్లు, రైతు భరోసా పడకుండానే పడినట్లు, సున్నా వడ్డీలో తప్పులు, వైద్యశాలకు వెళ్లకుండానే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నట్లు.. ఇలా పలు తప్పుడు లెక్కలు, లబ్ధిలో హెచ్చులు కనిపిస్తుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వలంటీర్లు పంపిణీ చేసిన గడప గడపకు సంక్షేమం పత్రాలలో ఇలాంటి తప్పులు కో కొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. ఈ తప్పుల విషయంలో అధికారులు నోరు మెదపడంలేదు. ప్రత్తిపాడులో చెర్లోపల్లి బుల్లెమ్మాయికి రూ.2 లక్షల విలువైన ఇంటి స్థలం వచ్చినట్లుగా పత్రం అందజేశారు. అయితే ఆమెకు స్థలం ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు కూడా ధృవీకరిస్తున్నారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తమకు స్థలం ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా పత్రంలో నమోదు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. పెదనందిపాడుకు చెందిన ఎం శ్రీనివాసరావు అనే వ్యక్తికి ఆరోగ్య శ్రీ ద్వారా రూ.60 వేలు లబ్ధి పొందినట్లు పత్రం ఇచ్చారు. అయితే తాము ఇంతవరకు వైద్యశాలకు వెళ్లలేదని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకోలేదని, అలాంటప్పుడు రూ.60 వేలు ఎటు వెళ్లాయని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే మరో బాలికకు ఒక్క సారి మాత్రమే అమ్మఒడి అందగా వలంటీర్లు ఇచ్చిన పత్రంలో రెండు సార్లు అందుకున్నట్లు ఉండటంతో వారు విస్తుపోతున్నారు. లబ్ధి అందుకోకపోయినా తప్పుడు పత్రాలతో వేలిముద్రలు వేయించుకోవడం ఏమిటని పలువురు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమరానికి సై

- బొప్పూడి వద్ద భారీ బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు
- సభా ప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేసిన కూటమి నేతలు
- ఏర్పాట్లు పరిశీలించిన నారా లోకేశ్ కూటమి నేతలు


చిలకలూరిపేట, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై సమరం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ తొలి ఉమ్మడి బహిరంగ సభ చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద భారీగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. సభా ప్రాంగణం నిర్మాణానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీజేపీ, జనసేన నేతలతో కలసి బుధవారం ఉదయం 9.32 గంటలకు భూమిపూజ చేశారు. జాతీయ రహదారి పక్కనే బొప్పుడి వద్ద 17న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. సభకు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాంతంలో రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ భూముల్లో ఉన్న పొగాకు తదితర పంటలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ రైతులకు నష్టపరిహారం చెల్లిస్తుంది. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో రాష్ట నలుమూల నుంచి లక్షలాది మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను అప్పగించారు. మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తీసుకున్న మూడు పార్టీలు సుమారు 15 లక్షల మంది జనసమీకరణకు ప్రణాళికలు రచించారు. ఈ బహిరంగ సభ వేదికగా దేశానికి ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక సందేశం ఇవ్వబోతున్నారని కూటమి నేతలు పేర్కొన్నారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికి, ప్రజలను కష్టాల నుంచి బయటపడటానికి, రైతులు సంతోషం, ఆడబిడ్డలు క్షేమం, యువతకు భవిష్యత్తు ఇవ్వడానికి ఈ బహిరంగ సభ దిక్సూచిలా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, యడ్లపాటి రఘునాథ్ బాబు, వల్లూరి జయప్రకాష్, లంకా దినకర్, శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానా యుడు, అనగాని సత్యప్రసాద్, మంతెన రామరాజు, పార్టీ సీనియర్ నేతలు జీవీ ఆం జనేయులు, పెందుర్తి వెంకటేష్, సత్య నారా యణరాజు, మూడు పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నవ శకానికి దిక్సూచిలా సభ: మాజీ మంత్రి ప్రత్తిపాటి

బొప్పూడి వద్ద జరగబోయే సభతో చరిత్ర సృష్టిస్తామని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సభ వైపు దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందన్నారు. ఎన్డీఏలో చేరిన తర్వాత తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి ఉమ్మడి మేనిఫెస్టో సభ నభూతో నభవిష్యత్ అన్నట్టుగా ఉంటుందన్నారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం తిరిగి ఎన్డీఏలో భాగస్వామ్యమైందన్నారు. మూడు పార్టీలు కూటమిగా పోటీచేయడం రాష్ట్రాభివృద్ధికి కొత్తబాటలు వేస్తాయన్నారు. కేంద్ర సహకారం లేనిదే రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణం చేయాలంటే తెలుగుదేశం- జనసేన- బీజేపీ పార్టీలు కలవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని పుల్లారావు తెలిపారు. బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ఎటువంటి అభివృద్ధి చేయకుండా లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా కూటమి పనిచేస్తుందన్నారు. జనసేన రాష్ట్రకార్యదర్శి కూడపాటి శివధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారమెత్తి యధేచ్ఛగా దోపిడీగా పాల్పడుతున్నారు.



సభా వేదిక ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న గడ్డర్లు





సభా ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మాణం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తమయ్యాయి.

ఏర్పాట్లపై లోకేశ్ సమీక్ష

రాష్ట్ర చరిత్రలో ఈ సభ నిలిచిపోయేలా నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. మూడు పార్టీల ముఖ్యనేతలతో ఏర్పాట్లపై లోకేష్ చర్చించారు. సభా ప్రాంగణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, హెలిప్యాడ్‌లు తదితర ఏర్పాట్లపై లోకేశ్ నేతలతో చర్చించారు. లక్షలాదిగా ప్రజలు రానున్న సందర్భంగా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. సభా ప్రాంగణం వద్ద ప్రారంభమైన పనుల ను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. బీజేపీ పొత్తు కుదిరిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభను ప్రతిష్ఠాత్మకంగా

18న ఎయిర్‌క్రాఫ్ట్స్ ల్యాండింగ్ ట్రయల్ రన్

ముందస్తు చర్యలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, మార్చి 13: జిల్లా పరిధిలోని కొరిశపాడు మండలం పిచికల గుడిపాడు వద్ద జాతీయ రహదారిపై ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ ఈ నెల 18న నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్‌రన్ విషయమై బాపట్ల ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ కమాండర్ జేపీయాదవ్, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ శ్రీధర్, నేషనల్ హైవే అథారటీ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ విషయంలో భాగస్వామ్యమయ్యే శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బాపట్ల ఎయిర్‌ఫోర్స్ అధికారులు కోరినట్లుగా 400 మంది సౌకర్యంగా కుర్చునేవిధంగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపకశాఖ, విద్యుత్, వైద్య, ఆరోగ్యశాఖలు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి విజయ్‌మీనాన్, నేషనల్ హైవే అథారటీ పీడీ విద్యాసాగర్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ శ్రీధర్

ఇసుక.. దోపిడీ

- తవ్వకాలు ఇక్కడా.. అనుమతులు ఎక్కడో..
- భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు
- గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన నిషేధాజ్ఞలు భేఖాతర్
- ముడుపుల మత్తులో మైనింగ్, సెబ్, పోలీసు, రెవెన్యూ శాఖలు

కొల్లూరు, మార్చి 13: ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎక్కడో ఇస్తే గుత్తేదారు మాత్రం అనుమతులు లేని నిషేధిత పట్టా భూముల్లో యధేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. అధికారపార్టీ నేతలతో పాటు భారీగా ముడుపులు అందడంతో యంత్రాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకునేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం, గాజుల్లంక వద్ద కృష్ణానది సర్వే నెం.180లో 4.950 హెక్టార్ల విస్తీర్ణంలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లుగా మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదికలు అందించారు. గత నెల 7వ తేదీ నుంచి ఇసుక తవ్వకాలకు భారీ యంత్రాలను సంవత్సరం పాటు నిషేధిస్తూ కూలీలతో మాత్రమే తవ్వకాలు చేయాలంటూ కలెక్టర్‌కు చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. అయినా కొల్లూరు మండలంలో మైనింగ్ అధికారులు సూచించిన దాఖలాలు లేవు. పైగా అనుమతులు గాజుల్లంక పరిధిలో ఉంటే ఇసుక తవ్వకాలు మాత్రం పెదల్లంక పరిధిలోని పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలను భారీ యంత్రాలతో తొలగిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. పెదల్లంక వద్ద కృష్ణానదిలో ఇసుక మేటలు తవ్వుకునేందుకు తమ గ్రామానికి సంబంధించిన ఆలయ పూజాది కైంకర్యాలకు వారానికి రూ.లక్షన్నర ముట్ట చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా దాదాపు పది అడుగులకు పైగా ఇసుకను తవ్వేసుకుంటున్నారు.



నీరు బయట పడే వరకు జరిగిన ఇసుక తవ్వకాలు



భారీ వాహనాలకు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రాలు

కన్నెత్తి చూడని యంత్రాంగం

ఇంత భారీ స్థాయిలో ఇసుక దందా జరుగుతున్న అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడటం లేదు. పైగా అసలు ప్రభుత్వం జీసీకేసీ సంస్థకు నదిలో ఎక్కడ ఇసుక ఉంటే అక్కడ తవ్వుకునే విధంగా అనుమతులు ఇచ్చిందని, ఫలనా చోటే తవ్వకాలు చేసుకోవాలనే నిబంధన ఎక్కడా పత్రాల్లో ఇవ్వలేదంటూ మైనింగ్ ఏడీ స్వయంగా చెబుతున్నారు. కానీ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు మాత్రం గాజుల్లంక పరిధిలోని కృష్ణానదిలో సర్వే నెం.180లో తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లుగా ఆయనే నివేదికలో పేర్కొన్నట్లు గ్రీన్ ట్రిబ్యునల్ విడుదల చేసిన ఆదేశాల్లో తేటతెల్లమైనా అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ఆయనకు భారీగా ముడుపులు అందుతున్నాయని, ఆయనతో పాటు సెబ్, పోలీస్, రెవెన్యూ శాఖలకు కూడా ముడుపులు చేరుతుండటంతో అక్రమ ఇసుక తవ్వకాల గురించి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు చేస్తే వారిని మైనింగ్ ఏడీ, సెబ్ అధికారులు మభ్యపెట్టి ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నట్లుగా మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. ఫిర్యాదుపై అక్రమ ఇసుక తవ్వకాల వద్దకు వచ్చి హడావుడి చేయడం, యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లుగా చెబుతూ ఫిర్యాదుదారులను తప్పుదారి పట్టిస్తున్నారు. వారు అక్కడ నుంచి వెళ్లిన తరువాత వారు తీసుకున్న చర్యలపై ఆరా తీస్తే యంత్రాల స్వాధీనాలు లేవని, ఒకటి రెండు ట్రాక్టర్లను అప్పగించి వాటిని కూడా సేఫ్ కస్టడీలో మాత్రమే ఉంచాలని నివేదిక ఇచ్చి వెళుతున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులు సైతం మైనింగ్, సెబ్ అధికారులు మమ అనిపిస్తూ తిరిగి నివేదికలు ఇస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నట్లు పలువురు వాపోతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వేసవి ప్రవేశించక ముందే లంక గ్రామాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలేనని రైతులు ఆరోపిస్తున్నారు. పంట పొలాలతో పాటు గృహాల్లో ఉన్న బోర్లు సైతం నీరు రాక మొరాయిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

అరవింద వారధికి పొంచి వున్న ముప్పు...

పది లంక గ్రామాలకు ప్రధాన మార్గంగా ఉన్న అరవింద వారధికి సైతం ముప్పు పొంచి ఉంది. పెదల్లంక గ్రామ పరిధిలో కృష్ణానదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు వారధికి అత్యంత సమీపంలో జరుగుతుండటంతో ఎగువ లంక గ్రామాల ప్రజలు వారధికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల కారణంగా అరవింద వారధితో పాటు కొన్ని లంక గ్రామాలు వరదల సమయంలో పొలాలు కోతకు గురై వరద నీరు గ్రామాలపై వచ్చి అవకాశాలు ఉన్నాయని, రైతులు, లంక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్న ఇసుక తవ్వకాలు జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి పరిశీలిస్తే అసలు విషయం బయట పడుతుందని చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(గురువారం)

సహారీ (ఉదయం) 5.00 (శుక్రవారం)

దిక్సూచి
DIKSUCHI

ఎన్‌సీహెచ్‌ఎంసీటీలో ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్



నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్‌ఎంసీటీ)- ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా 17 ఐహెచ్‌ఎంలు ఉన్నాయి. డైరెక్ట్ అడ్మిషన్స్, ఎమ్మెస్సీ జేఈఈ 2024 కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. డైరెక్ట్ అడ్మిషన్స్‌కు అకడమిక్ మెరిట్ ద్వారా ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు కేటగిరీలకు అప్లయ్ చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి 'జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)' పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ లేదా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నుంచి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌ను కనీసం 55 శాతం మార్కులతో పూర్తిచేయడానికి తోడు త్రీ స్టార్ హోటళ్లలో రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారికి డైరెక్ట్ అడ్మిషన్ ఇస్తారు. కేవలం హాస్పిటాలిటీ సహా ఏదేని విభాగంలో డిగ్రీ పూర్తిచేసినవారికి ఎమ్మెస్సీ జేఈఈ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎమ్మెస్సీ జేఈఈ వివరాలు: దీనిని సీబీటీ/ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, హాస్పిటాలిటీ ఆప్టిట్యూడ్ జనరిక్, జనరల్ హోటల్ ఆపరేషన్స్, కరెంట్ అఫైర్స్/జనరల్ నాలెడ్జ్, సస్టయినబుల్ టూరిజం అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, అప్రిసియేషన్ ఆఫ్ కల్చరల్ డైవర్సిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు; కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్ అండ్ న్యూమరిక్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు.

- **డైరెక్ట్ అడ్మిషన్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; జనరల్ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డైరెక్ట్ అడ్మిషన్స్‌కు ఏప్రిల్ 15; ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఏప్రిల్ 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 10 నుంచి
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.nchm.gov.in

నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఎల్ఐఎస్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్ఐయూ)- మాస్టర్ ఆఫ్ సైబర్ లా అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(ఎంసీఎల్ఐఎస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ నేషనల్ సైబర్ లా సెంటర్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా నిర్వహించే రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: రీసెర్చ్ మెథడాలజీ, సైబర్ ఎన్విరాన్‌మెంట్, సైబర్ లా, క్రిప్టోగ్రఫీ-నెట్‌వర్క్ సెక్యూరిటీ, ప్రైవసీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ సైబర్ స్పేస్, మొబైల్ వైర్‌లెస్-సెక్యూరిటీ, బిజినెస్ ప్లానింగ్-ఆడిట్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ లా, క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీ అండ్ లా కోర్సులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 30, ఎస్టీలకు 12, ఎస్సీలకు 10, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 6 సీట్లు కేటాయించారు. అన్ని కేటగిరీల్లో 50 శాతం సీట్లను స్థానికులకు(మధ్యప్రదేశ్ వాసులు) ప్రత్యేకించారు. మహిళలకు 18 సీట్లు, దివ్యాంగులకు 3 సీట్లు నిర్దేశించారు. విదేశీ విద్యార్థుల కోసం అదనంగా అయిదు సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.


ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, కంప్యూటర్ నాలెడ్జ్, సైబర్ సెక్యూరిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు ఉంటాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మే 12
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 12, 13, 14
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5H4Efc8లో చదవండి.

రైల్వేలో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీలు: 9144



దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: **1,092 పోస్టులు**
2. టెక్నీషియన్ గ్రేడ్-3: **8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/వైర్‌మ్యాన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంది.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

సమ్మర్ ఇంటర్న్‌షిప్

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టయిపెండ్: ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024:** మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఈ-మెయిల్:** research@iittp.ac.in
- **వెబ్‌సైట్:** www.iittp.ac.in

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నా

రాజమౌళి



'సాధారణంగా నాకు రోమ్ కామ్ సినిమాలు నచ్చవు. యాక్షన్, మాస్ చిత్రాలు కావాలి నాకు. కానీ 'ప్రేమలు' సినిమాను థియేటర్‌లో చూస్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఇది తప్పకుండా థియేటర్‌లోనే చూడాల్సిన చిత్రం' అన్నారు దర్శకుడు రాజమౌళి. కామెడీ, లవ్ అంశాలతో మలయాళంలో రూపొందిన చిత్రాన్ని ఆయన తనయుడు కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజమౌళి మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్‌గా మారిన కార్తికేయను ఆయన అభినందించారు. 'మలయాళంలో కంటే తెలుగులో డైలాగులు బాగున్నాయి. పరీక్షలు ఉన్నాయని ఈ సినిమా చూడడం మానకండి. చిత్రం చూస్తే ఇంకా రిలాక్స్ అయి బాగా చదువుతారు' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. కార్తికేయ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైమ్‌లో ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాం. రచయిత ఆదిత్య , పాటల రచయిత కిట్టు .. ఇలా మేమందరం కలసి వారం రోజుల్లోనే పూర్తి చేశాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మమిత, నస్లీన్, దర్శకుడు గిరీశ్, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకాక్‌లో యాక్షన్ స్టార్ట్



ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం బ్యాంకాక్‌లో నాగార్జున, ఇతర నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలు, యాక్షన్ పార్ట్ చిత్రీకరిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇంతవరకూ ఎవరూ చూడని అద్భుత లోకేషన్స్‌లో జరుగుతుందని నిర్మాతలు చెప్పారు. రష్మిక కథానాయికగా నటిస్తున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.



హను-మాన్ టీమ్‌కు ప్రశంసలు

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుంచి ఉద్భవించిన సూపర్ హీరోలను అద్భుతంగా చూపించి విజయం సాధించిన 'హను-మాన్' చిత్రం టీమ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. పార్టీ సమావేశంలో పాల్గొనడం కోసం హైదరాబాద్ వచ్చిన అమిత్ షాను 'హను-మాన్' చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ, నిర్మాత నిరంజన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హనుమంతుడి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' కూడా విజయం సాధించాలని అమిత్ షా ఆకాంక్షించారు.

ఫికర్ మత్ కరో అనిపించాలి

ఆర్. నారాయణమూర్తి



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ మంగళవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, దర్శకుడు త్రినాథరావు నక్కిన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'ఈ సినిమాలో సాయిరామ్ శంకర్ 'ఫికర్ మత్ కరో' అనే డైలాగ్ చెబుతుంటారు. ఆయన అందరి నోట 'ఫికర్ మత్ కరో' అనిపించాలి' అని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశ్ పూరి మాట్లాడుతూ 'మా బాబాయ్‌లోని ఎనర్జీ ఎక్కడా లేదు. 'బంపర్ ఆఫర్'లో ఆ ఎనర్జీని చక్కగా చూపించారు. దానికి మించి ఈ సినిమాలో చూస్తారు' అన్నారు. 'దర్శకుడు నవీన్ కథ చెప్పగానే నచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌కు సూట్ అవుతూనే మంచి పాయింట్‌తో కథ రాసుకున్నారని అనిపించింది. నాకు కమ్ బ్యాక్ మూవీ అవుతుంది' అని చెప్పారు సాయిరామ్ శంకర్. దర్శకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 'మా నిర్మాత సపోర్ట్‌తో 34 రోజుల్లోనే సినిమా పూర్తి చేశామని నిర్మాత దేవరాజ్ కోరారు.

హై యాక్షన్ ప్యాక్డ్ మూవీ



శివకార్తికేయన్ హీరోగా ఏ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ రెండో షెడ్యూల్ మొదలైంది. చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ బడ్జెట్ చిత్రమనీ, ఇంతకు ముందు నటించిన చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన కనిపిస్తారనీ నిర్మాతలు చెప్పారు. కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో హై యాక్షన్ ప్యాక్డ్‌గా తయారవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. సుదీప్ ఎలామన్ సినిమాటోగ్రాఫర్.



రాజావారు రాణిగారి పెళ్లిసందడి

రాజావారు రాణిగారు చిత్రంతో హీరో హీరోయిన్లుగా తెలుగు తెరకు పరిచయమైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ జంట నిజజీవితంలోనూ ఒక్కటవబోతోంది. ఆ సినిమా సమయంలోనే ప్రేమలో పడిన ఈ జంట త్వరలోనే పెళ్లిపీటలెక్కబోతోంది. హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో బుధవారం వీరిద్దరి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఉంగరాలు మార్చుకున్నారు. వీరి నిశ్చితార్థం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

స్వచ్ఛమైన ప్రేమకథ లంబసింగి

నవీన్ గాంధీ



భరత్‌రాజ్ హీరోగా, దివి హీరోయిన్‌గా నటించిన 'లంబసింగి' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ 'ఒక స్వచ్ఛమైన ప్రేమకథను సహజంగా చూపించాలని 'లంబసింగి' చిత్రం తీశాను. కొత్తవారయితేనే బాగుంటుందని నూతన నటీనటులతో రూపొందించాం. సినిమాలో ప్రతి పాత్ర రియలిస్టిక్‌గా ఉంటుంది. లంబసింగి అనే ఏజెన్సీ ప్రాంతంలో 50 రోజుల పాటు సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ చేశాం. ఇలాంటి ప్రేమకథలకు సంగీతం ప్రధానం. అందుకే పాటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌తో చేయించాం. అన్ని పాటలు మంచి ఆదరణ పొందాయి' అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సొంతంగా బేనర్ స్టార్ట్ చేసి కథలు వింటున్నారని తెలసి ఆయన్ని కలిశాననీ, తను చెప్పిన కథ ఆయనకు నచ్చిందనీ నవీన్ గాంధీ తెలిపారు. అయితే కరోనా కారణంగా షూటింగ్ ఆలస్యంగా మొదలైందని చెప్పారు.

పతంగ్ పాట



పతంగుల పోటీ నేపథ్యంలో తెలుగులో తెరకెక్కిన తొలి క్రీడా నేపథ్య చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. గాయకుడు ఎస్పీ చరణ్ కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'హే హలో నమస్తే' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ విడుదల చేశారు. చిత్రబృందానికి ఘన విజయం దక్కాలని చంద్రబోస్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి జోస్ జిమ్మీ సంగీతం ప్రధాన బలం అని నిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Q0IoNHD లో చదవండి.

యూత్ టీమ్‌తో ఫైటర్ రాజా



రామ్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రలు పోషించే 'ఫైటర్ రాజా' చిత్రం ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీవిష్ణు లాంచ్ చేశారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా రోజుల తర్వాత ఓ విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లు తనికెళ్ల భరణి చెప్పారు. రియలిస్టిక్‌గా ఉంటూ యూత్‌ను ఆకట్టుకొనే చిత్రమిదని ఆయన తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన దినేశ్ యాదవ్ బొల్లెబోయిన మాట్లాడుతూ 'యంగ్ టీమ్‌తో నిజాయితీగా ఈ చిత్రం తీస్తున్నాం' అని చెప్పారు. 'నా తొలి సినిమా 'పచ్చీస్' కొవిడ్ కారణంగా ఓటీటీలో విడుదలైంది. కానీ 'ఫైటర్ రాజా' థియేటర్లలో సందడి చేస్తుంది' అని హీరో రామ్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీకి మద్దతుగా నిలవండి

● అన్ని విధాల అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి13: గురజాల నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు రజకులు, వడ్డెర సామాజికవర్గం కూడా టీడీపీకి, తనకు వెన్నంటే ఉన్నారన్న విషయాన్ని గుర్తుచేస్తూ రేపటి అధికారంలోకి వచ్చాక వారికి అన్నివిధాల అండగా వుంటామని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానికంగా ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దాచేపల్లిలో ఎకరం స్థలం కేటాయించామని, పిడుగురాళ్లలో 85 సెంట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పిడుగురాళ్లలో 85 సెంట్లు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. దాచేపల్లి, పిడుగురాళ్లలోనే కాకుండా అవసరమైన చోట కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని అన్నారు. అదేవిధంగా చదువుకున్న యువతకు యూత్ పాలసీ ద్వారా స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెడతామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోపాటు గురజాల నియోజకవర్గంలో తాను సొంతంగా తీసుకురానున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతారన్నారు. మట్టపల్లి లక్ష్మీనర సింహస్వామి దేవాలయం ముదిరాజుల సత్రంలో వంటసామగ్రి కొనుగోలుకు రూ.16 వేలకు పైగా నగదును అందజేసిన యరపతినేని శ్రీనివాసరావును ఈ సందర్భంగా సంఘ సభ్యులు సత్కరించారు. సమావేశంలో రొండి శేషయ్య, కారుకోళ్ల నాగరాజు, గొర్రె హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, ఎం.శివ, ఎన్.నరసింహారావు, బి.శ్రీనివాసరావు, ఎం.గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

నకరికల్లు, మార్చి 13 : నకరికల్లు మండలం చల్లగుండ్ల శివారు సున్నం బట్టీ సమీపంలో గల దాబాలో రైడీషీటర్‌ను మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు కత్తులు, మారణాయుధాతో బుధవారం రాత్రి నరికి చంపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన చెరవల్లి మణికంఠ (27) వృద్ధురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. దొంగతనం కేసుల్లోనూ మణికంఠ నిందితుడిగా ఉన్నాడు. రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో మణికంఠపై రౌడీషీట్ నమోదైంది. బుధవారం రాత్రి మణికంఠ సున్నం బట్టీ సమీపాన గల ఓ దాబాలో టిఫన్ చేసేందుకు రాగా ప్రత్యర్థులు మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వచ్చి కత్తులు, మారణాయుధాలతో మణికంఠను హత్యచేశారు. ఒక మహిళతో వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్, నకరికల్లు ఎస్ఐ వి.రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పుడు తలెత్తుకుని జీవిస్తున్నాం..

● రోడ్డు మీద చెత్త ఏరుకొంటూ జీవించే వాళ్లం
● స్వచ్ఛత ఉద్యమి యోజన ద్వారా లబ్ధి పొందాం
● ప్రధానితో ముఖాముఖీగా మాట్లాడిన ఆదిపూడి ముత్తమ్మ



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



ప్రధాని తో మాట్లాడుతున్న లబ్ధిదారు ముత్తమ్మ

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సార్... మా కుటుంబ సభ్యులు రోడ్డు మీద చెత్త ఏరుకొని బతికేవాళ్లం. రోడ్డు మార్జిన్‌లో ఎండనక వాననక నాభర్త, ఇద్దరు పిల్లలతో జీవించాను. స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం ద్వారా లబ్ధి పొంది ఇక్కడకు వచ్చి మాట్లాడే స్థాయికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అని కాకుమానువారి తోటకు చెందిన ఆదిపూడి ముత్తమ్మ వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెనుకబడిన తరగతుల ఔట్ రీచ్ కార్యక్రమంలో ముత్తమ్మతో ముఖాముఖిగా సంభాషించారు. ముత్తమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛత ఉద్దమీ యోజన పథకం ద్వారా డీసిల్టింగ్ వాహనం (సెప్టిక్ ట్యాంక్)కు ఎంపికవ్వటంతో చాలా సంతోషం వచ్చిందన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ అందించిన తరువాత నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నాని తెలిపారు. నేను డ్రైవింగ్ నేర్చుకొని సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని స్వయంగా నడుపుకుంటూ మరింతగా వృద్ధి చెందుతానన్నారు. నెలకు రూ.10 వేలు ఆదాయం పొందుతున్నానని తన సంతోషాన్ని ప్రధానితో పంచుకొన్నారు. .

తొలుత గౌరవ ప్రధాన మంత్రి పీఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను, అణగారిన వర్గాలు ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీలకు రుణాల మంజూరు పథకాన్ని, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీని రిమోట్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ లబ్ధిదారు ఆదిపూడి ముత్తమ్మతో మాట్లాడుతూ మరో ఐదు ఏళ్లలో వెనుకబడిన, పేదవారి అభ్యున్నతికి మరిన్ని పథకాలు విస్తృత స్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ హర్షవర్ధన్, సామాజిక న్యాయ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్, ఎన్ఎస్ఎఫ్డీసీ - శ్రీనిధి రుణాలు, పీఎం-సూరజ్ యూఎస్‌వై పథకం ద్వారా 218మంది డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రూ.1,33,51,900 చెక్కును, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టీస్ అండ్ ఎంపవర్మెంట్ డీజీఎం నవన్ బారువా, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల సహాయక కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, డీఆర్డీఏ పీడీ హరిహర నాథ్, ఎన్ఎస్ కెఎఫ్ డీసీ డిప్యూటీ మేనేజరు సందీప్ గుప్తా, ఎన్ఐ ఎస్‌డీఎఫ్‌సీపీఎంయులు సౌజన్య, మహిమ, ఎన్సీసీ ఎఫ్‌డీసీ, ఎన్ఎస్ ఎఫ్డీసీ, నమస్తే లబ్ధిదారుల, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు పాల్గొన్నారు.



పీఎం సూరజ్ యూఎస్‌వై పథకం చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు



నృసింహాలయంలో పూజలు నిర్వహించిన శివస్వామి

కూటమి విజయాన్ని కాంక్షిస్తూ..

విజయ శంఖారావ యాత్ర

● శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి వెల్లడి..
● లక్ష్మీనృసింహ స్వామి,రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మంగళగిరి సిటీ, మార్చి 13: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించాలని కోరుకుంటూ విజయ శంఖారావం పేరిట యాత్ర నిర్వహిస్తున్నట్టు శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి తెలిపారు. ఈ యాత్రలో భాగంగా బుధవారం ఉదయం ఆయన మఠ పీఠాధిపతులతో కలిసి మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివస్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అయోధ్యలో బాలరాముడి దివ్య ప్రతిష్ఠతో భారతీయుల్లో చైతన్యం వెల్లివిరుస్తోందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 375నుంచి 400 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకోవాలని, ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఘనవిజయం సాధించాలని, మంగళగిరిలో ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న నారా లోకేశ్ భారీ ఆధిక్యంతో గెలుపొందాలని స్వామివారిని వేడుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు విశ్వధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విజయ శంఖారావ యాత్రను చేపట్టినట్టు తెలిపారు. తొలిదశలో తెనాలి రోడ్డులోని వరసిద్ధి గణపతి, విజయవాడ కనకదుర్గమ్మ, మంగళగిరి నృసింహస్వామి, రాజధాని రైతుల శిబిరాన్ని సందర్శించినట్టు తెలిపారు. రెండో విడతలో శుక్రవారం నుంచి గుంటూరు బృందావన గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి, త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీశైలం మల్లన్న క్షేత్రాలను దర్శిస్తామన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి జానకీదేవి, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, శైవ క్షేత్రం మఠ పీఠాధిపతులు పాల్గొన్నారు.



మందడం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

● 1548వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు మార్చి 13: అమరావతే ఐదు కోట్ల మంది తెలుగు ప్రజల రాజధాని అని, మూడు రాజధానులనే ఆలోచనను సీఎం జగన్‌రెడ్డి మానుకోవాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బధవారం నాటికి 1548వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తిచేసి ఉంటే యువత బయట రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేయాల్సి వచ్చేది కాదని, వందల కంపెనీలు అమరావతిలో ఉండి ఇక్కడ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉండేవారని అన్నారు. కేంద్రరంగ సంస్థలకు రాజధాని అమరావతిలో స్థలాలు కేటాయించి ఉండగా, వాటి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం అమరావతిపై కక్ష ఎందుకు పెంచుకున్నారో తమకు అర్థం కావటం లేదన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్ర భవిషత్ ఆశాజనకంగా ఉండదన్నారు. అమరావతితోనే ఉజ్వల భవిషత్ అన్నారు. కాని జగన్‌రెడ్డి డిక్షనరీలో అభివృద్ధి అనే పదం లేనేలేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలతో పాటు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

'యువత మేలుకో - చంద్రన్నను ఎన్నుకో' లఘుచిత్రం ఆవిష్కరణ

తుళ్లూరు గ్రామానికి చెందిన తరిగోపుల హరీష్ రూపొందించిన 'యువత మేలుకో -చంద్రన్నను ఎన్నుకో..' అనే లఘుచిత్రాన్ని బుధవారం తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు ఆవిష్కరించారు. టీడీపీఫోరం సింగపూర్(ఐటీ) ఎంప్లాయిస్ ఈ లఘుచిత్రాన్ని నిర్మించారు. ఈసందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ 'అరాచకాన్ని అంతం చేద్దాం.. అభివృద్ధిని ఎన్నుకుందాం' అనే నినాదంతో ఈ లఘుచిత్రాన్ని నిర్మించామన్నారు. హరీష్ మాట్లాడుతూ షోషల్ మీడియా ఛానెల్స్‌లో మంగళవారం ఈ చిత్రాన్ని రిలీజ్ చేయగా 24గంటల్లోనే లక్ష మంది యూ ట్యూబ్‌లో చూశారని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, రైతులు, జేఏసీ నేతలు కాటా అప్పారావు పాల్గొని చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మాజీ సీఎం రోశయ్య ఇప్పుడే గుర్తుకొచ్చారా?

● ఆ సామాజికవర్గ ఓట్ల కోసమే ఆగమేఘాలపై విగ్రహం..
● నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

వినుకొండ, మార్చి 13: వైసీపీ నాయకులకు ఐదేళ్ళుగా గుర్తుకురాని మాజీ సీఎం రోశయ్య ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు గుర్తుకొచ్చారా అని నర్సరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని గంగినేని కళ్యాణ మండపంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రోశయ్య సామాజిక వర్గం ఓట్ల కోసమే రెండ్రోజుల్లోనే ఆగమేఘాలపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ అదే సామాజిక వర్గానికి ఎమ్మెల్యే బొల్లా ఏమి చేశారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడు వాటర్‌గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీరందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తొడలు గొట్టే సంస్కృతి తమది కాదని, అభివృద్ధే మా ధ్యేయమన్నారు. గడిచిన ఐదేళ్ళలో తాను ఎంపీగా ఎవరినీ విమర్శించలేదని, పల్నాడు అభివృద్ధి కోసమే పాటుపడ్డానన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతులను ఎమ్మెల్యే తీసుకొస్తాడా, ఎంపీ తీసుకొస్తాడో తెలుసుకోవాలని బొల్లాను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలకు అనుమతులు రాగా ఒకటి పల్నాడు జిల్లాకు తీసుకొచ్చానని తెలిపారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మలికార్జునరావులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లాకు వినుకొండ నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పంటకు గిట్టుబాటు ధర అడిగినందుకు రైతును చెప్పుతో కొట్టబోవడమే కాక జైలులో పెట్టించిన దుర్మార్గుడు బ్రహ్మానాయుడని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయని, వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీరిచ్చి, రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

● భార్య మృతి, భర్త, కుమార్తెల పరిస్థితి విషమం

తెనాలి, మారీసుపేట మార్చి 13: ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక.. మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేదనకు గురై ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటన తెనాలిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్త, కుమార్తెల పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. స్థానిక నాజరుపేటకు చెందిన విష్ణుమొలకల శివశంకర్రావు, భార్య నాగమణి(45), కుమార్తె హారికలు నివాసం ఉంటున్నారు. పాల వ్యాపారం చేసిన శివశంకర్రావు అది లాభసాటిగా లేకపోవడంతో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో చిన్న కొట్టు తీసుకుని టీ వ్యాపారాన్ని నిర్వహిస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుమార్తెకు తెనాలికి చెందిన వ్యక్తితో ఘనంగా పెళ్లి చేశారు. అయితే కొంత కాలంగా కుమార్తె కాపురంలో కట్నం కోసం వేధింపులు చోటు చేసుకున్నాయి. దానికి తోడు వివాహానికి కట్నకానుకల కోసం చేసిన అప్పులు పెరిగి, వారి నుంచి ఒత్తిడి కూడా ప్రారంభమైంది. అదనపు కట్నం కోసం తీసుకు రాలేదని అల్లుడు, అతడి కటుంబసభ్యులు తమ కుమార్తెను ఇంటికి పంపించకుండా మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు గురి చేస్తున్నారు. దీంతో శివశంకర్రావు తన కుమార్తెను ఇంటికి తీసుకు వచ్చారు. వరకట్న వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఆరు నెలలుగా కుమార్తె పుట్టింట్లోనే ఉంటున్నది. అదనపు కట్నం తెస్తేనే కాపురానికి రావాలని మధ్యవర్తితో అల్లుడు ఒత్తిడి పెంచడం ప్రారంభించాడు. ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేదనకు గురైన శివశంకర్రావు కుటుంబసభ్యులతో కలసి ఆత్మహత్యకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురూ గుళికలనుతిన్నారు. గమనించిన బంధువులు వారిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి(45) మృతి చెందదింది. శివశంకర్రావు, హారికల పరిస్థితి విషమంగా ఉన్నది.

పోలీసుల నిర్లక్ష్యమే కారణం : నాగమణి సోదరుడు

బావ, అక్క కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని నాగమణి సోదరుడు శీలం రాజా ఆరోపించారు. తమ అక్క కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని శిక్షించాలన్నారు. మరొకరి కుటుంబానికి ఇలా జరగకుండా చూడాలని కోరారు. అయితే పోలీసులు మాట్లాడుతూ ఇరు కుటుంబాల వారు పరస్పరం కేసులు నమోదు చేసుకున్నారని ప్రస్తుతం కోర్టులో ఉన్నాయన్నారు.

హనుమంతుడి విగ్రహం

అత్యంత పురాతనం

నకరికల్లు, మార్చి 13: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో ఉన్న హనుమంతుని విగ్రహం 1591లో ప్రతిష్ఠించినట్టు పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజి హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు శాసనం ద్వారా తెలుస్తుందన్నారు. ఆ నాటి హనుమంత స్వామే నేడు రూపెనగుంట్ల వీరాంజనేయ స్వామిగా భక్తులు పూజిస్తున్నారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న బీజేపీ

● కేంద్రం కనుసన్నల్లోనే చంద్రబాబుకు జైలు
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వినుకొండటౌన్, గుంటూరు(తూర్పు), మార్చి13: కేంద్రం కనుసన్నల్లోనే సీఎం జగన్మోహన్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ఎటువంటి ఆధారాలు లేకుండా 53 రోజులు జైలులో ఉంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం బెదిరింపు ధోరణితో దేశంలోనే వివిధ రాజకీయపార్టీలను ఎన్డీఏలోకి చేర్చుకుంటుందని ఆరోపించారు. తెలంగాణలో టీడీపీ పోటీ చేయడాన్ని బీజేపీ అడ్డుకుందని, పార్టీలను బ్లాక్‌మెయిల్ చేసి నితీష్‌కుమార్‌తోపాటు అశోక్‌చోహాన్ వంటి నాయకులను సైతం బీజేపీలో చేర్చుకొని తాయిళాలు ప్రకటిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీని కూడా బెదిరింపు ధోరణితో తన దారిలో తెచ్చుకునేందుకు లిక్కర్ కేసు పేరుతో బెదిరిస్తున్నారన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి లిక్కర్ మాఫియా కొనసాగిస్తున్నా ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇష్టం లేకపోయిన పొత్తుతో పనిచేసేందుకు సీట్ల పంపకం కూడా జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీ టీడీపీ, జనసేనతోపాటు ఇతర ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రంలోని సమస్యలపై పోరాటాలు చేశామన్నారు. ఇండియా కూటమితో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తున్నామని అన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులు రాజ్యం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సంద్రపాటి సైదా, బూదాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా సాధారణ సమావేశానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరోసారి మోదీ అధికారంలోకివస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి దేశంలో మనుస్మృతిని ప్రవేశపెడతాడని, పొత్తుల విషయంలో ప్రాంతీయ పార్టీలు పునరాలోచన చేయాలని కోరారు. మతాల మధ్య చిచ్చుపెట్టే సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జంగాల అజయ్ కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

● ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించిన వైసీపీ నేత



సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరుటౌన్, మార్చి13: పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ వేదికలుగా మారుతున్నాయి. మండలంలోని సీతారామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రారంభించటం వివాదస్పదమైంది. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్తగా వెళ్లిన నాటి నుంచి పొన్నూరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం మొత్తం అంబటి మురళీకృష్ణ వెంట నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాక్రమంగా నిర్వహించాల్సిన సచివాలయ ప్రారంభం వైసీపీ కార్యక్రమంగా నిర్వహించటం పట్ల ప్రజలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. సీతరామపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్‌ను సైతం ఈ ప్రారంభ కార్యక్రమానికి అధికారులు దూరం పెట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

1,41,742 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,20,628 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,41,742 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,744 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	19500
నెంబరు. 5	10000	17000
273	11000	14500
341	9500	19000
4884	9000	14000
సూపర్ 10	11500	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	19000
దేవనూరు డీలక్స్	10000	20500
తెల్లకాయలు	5000	12500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 13 : ఓటర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించుటకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు కలిగిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. ఇప్పటి వరకు వివిధ రకాల ఫారంలు 4,700 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించుటకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు మాల్యాద్రి, టీడీపీ నాయకులు షేక్ మహ్మద్‌గౌస్ బాషా, బీజేపీ నాయకులు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవి, బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ జిల్లా అధ్యక్షుడు బాలాజిరెడ్డి పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు కలెక్టర్ నివాళి

బాపట్ల, మార్చి 13 : తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులతో కలిసి మొల్లమాంబ పటానికి పుష్పాంజలి ఘటించారు. మహనీయులు రచించిన గ్రంథాలను ఆధారంగా చేసుకొని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగుభాషలో మొల్లరామాయణం రాయటం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.అర్జునరావు, పీవీఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన కవిత్వం మొల్లమాంబ ప్రత్యేకం

విలువలతో కూడిన కవిత్వం మొల్లమాంబ ప్రత్యేకమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి మొల్లమాంబ పటానికి పుష్పాంజలి ఘటించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కవిత్వమైన, బోధనలైన గ్రామీణస్థాయి ప్రజల మనస్సుల్లో సుస్థిరమైనప్పుడే చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈకోవకు చెందిన మొల్లమాంబ రచనలను కొనియాడారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ, ఎస్కే మౌలుద్దీన్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించాలి : కేశన



సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

బాపట్ల, మార్చి 13 : దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. సంఘనాయకులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ రాజకీయపార్టీలు అధికారంలోకి రావటానికి బీసీల కు కల్లబొల్లి మాటలు చెప్పి కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారన్నారు. బీసీలకు సీట్లు కేటాయింపులో సముచిత స్థానం ఇవ్వని పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. జిల్లా అధ్య క్షుడు జువ్వా శివరామప్రసాద్ మాట్లాడుతూ బీసీ నేతల రాజకీయ ఎదుగుదలకు ఏ పార్టీలు అవకాశం ఇవ్వడం లేదన్నారు. 54శాతం ఉన్న బీసీలకు సీట్ల కేటాయింపు ఇదేనా అని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, గౌరవాధ్యక్షులు మద్దిబోయన తాతయ్య, అంగలకుదురు నటరాజన్, మారం రవికుమార్, ఎన్ఎస్‌పీ రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ.కోటి 56 లక్షలు మంజూరు : జేసీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న జేసీ శ్రీధర్

బాపట్ల, మార్చి 13: కేంద్రప్రభుత్వం ఎన్ఎంఎఎస్‌టీఈ పథకం కింద జిల్లాలోని 193 మంది లబ్ధిదారులకు కోటి 56లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూరజ్‌పోర్టల్‌ను న్యూఢిల్లీ నుండి ఆవిష్కరించగా కలెక్టరేట్ లో జేసీ సీహెచ్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికార అధికారి జె.రాజాదేబోరా, ఎస్సీ కార్పొరేషన్ ఈవో నరసింహారావు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

● ఎస్పీ వకుల్ జిందాల్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మార్చి 13 : పోలీసు కుటుంబాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇటీవల మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబసభ్యులకు బుధ వారం ఫ్లాగ్ ఫండ్, విడోఫండ్ చెక్కులను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరిశపాడు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన డి.మరియదాసు భార్య ఎస్తేరు రాణికి విడో ఫండ్ రూ.50వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ.25వేల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబం వివరాలు అడిగి తెలుసుకొని శాఖాపరంగా సహాయసహకారాలు అందించటానికి సిద్ధంగా ఉంటామని భరోసానిచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీపీవో బీసెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

సంకీర్ణ ప్రభుత్వంతోనే బీసీల సంక్షేమం సాధ్యం

● టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



జయహో బీసీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 13 : సంకీర్ణ ప్రభుత్వంతోనే బీసీల ప్రగతి, సంక్షేమం సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ తెలి పారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమాన్ని పట్టణ, మండల నాయకులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10లక్షలతో పునరుద్ధరిస్తామన్నారు. జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎన్ వెంకటశివన్నారాయణ మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యాపథకాలు అన్ని పునరుద్ధరించి బీసీ భవనాలు, కమ్యూనిటీ హాలు నిర్మాణాలు ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, తెలుగురైతు అధ్యక్షుడు నక్కల వీరరాఘవయ్య, మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపెయిన్ వారియర్స్‌కు వేగేశన అభినందనలు

నియోజకవర్గంలో చేపట్టిన మైఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. బాపట్ల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేగేశన నరేంద్రవర్మ వారియర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన తాతా హరిశ్చంద్రప్రసాద్, వేగేశన రాకేష్‌వర్మ, నాయకులు పల్లం సరోజినీ, పరిశా గోపి, గ్లోరియానేట్, యర్రాకుల నాగరాజు, కాటూరి నవీన్‌లను అభినందించారు. పల్లం సరోజినీ, రాష్ట్ర పార్లమెంట్, మహిళల విభాగంలో స్టేట్‌ఫస్ట్‌లో నిలిచారు. పరిశాగోపి 7వ స్థానం, గ్లోరియానేట్ మూడో స్థానం, యర్రాకుల నాగరాజు నాలుగో స్థానం, నవీన్ ఐదో స్థానంలో నిలిచారు.



వేగేశన సమక్షంలో టీడీపీలోకి చేరిన చందోలు వైసీపీ నాయకులు

వేగేశన సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పిట్టలవానిపాలెం, మార్చి 13: మండలపరిధిలోని చందోలు గ్రామ పంచాయతీకి చెందిన చందోలు వైసీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రహీమ్ (ఎల్లుండి) స్థానిక వైసీపీ నాయకులతో ఇమడలేక తన అనుచరులు, బంధువులతో పిట్టలవానిపాలెం టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీసెల్ అధ్యక్షులు మహ్మద్‌ఖాశీల ఆధ్వర్యంలో బుధవారం బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో సుమారు 25 మంది టీడీపీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలను వేగేశన నరేంద్ర వర్మ సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. టీడీపీ నుంచి వైసీపీలో చేరినవారిలో మహ్మద్ అబ్దుల్ రహీమ్, ఇబ్రహీమ్, షేక్ అబ్దుల్, మహ్మద్‌బేగ్, కరీముల్లా, షాహిదీ, షేక్ ఖాజావలి, సయ్యద్ కరీముల్లా, సయ్యద్ జాన్‌సైదా, షేక్.కాషిఫ్, షేక్.కరీముల్లా, షేక్.మెహరున్నీసా, మహిళా కార్యకర్త షేక్.హసీనా, షేక్.మొబినా, షేక్.సమీరా, షేక్.రహమాబి, షేక్.షంషాద్, షేక్.నజిరీన్, షేక్.షకీలా, అమీరున్నీసా, షకీలాబేగం, షేక్.రేష్మా, షేక్.రతిపున్నిసా, షేక్.మస్తానిలు ఉన్నారు.

రాయప్రోలు సుబ్బారావు చిరస్మరణీయులు : రావూరి

బాపట్ల టౌన్, మార్చి 13: మహాకవి రాయప్రోలు సుబ్బారావు చిరస్మరణీయులని సాహితిభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. బుధవా రం రాయప్రోలు జయంతి కార్యక్రమంలో సాహితీభారతి కోశాధికారి ఆదంషి, ఎం మాల్యాద్రిరావులు సంయుక్తంగా మాట్లాడుతూ ఆంధ్రజాతిని జాగృతం చేసిన వారిలో రాయప్రోలు అగ్రగణ్యులన్నారు. రాయప్రోలు బాపట్ల ప్రాంతవాసి కావటం, బాపట్ల బోర్డుస్కూల్లో విద్యాభ్యాసం చేయటం అందరికి గర్వకారణమన్నారు. అనంతరం రచయితలు రావూరి నరసింహవర్మ, ఆదంషఫి, ఎం మాల్యాద్రిరావు, ఎస్ కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు రాయప్రోలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన ర్యాలీ

బాపట్ల, మార్చి 13: డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల ఎన్ ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం తమ మొదటి ఓటు హక్కును అందరు సద్వినియోగించుకోవాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒక ఓటు చరిత్రగతిని మారుస్తుందని, మన భవిష్యత్తును మారుస్తుందని కళాశాల అసోసియేట్ డీన్ ఎల్.ఏడుకొండలు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి విమల విద్యార్థులకు ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు చేతబూని పురవీధుల్లో ర్యాలీ చేశారు. కొత్త బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. డాక్టర్ బ్లెస్సీ సాగర్, ఉపాధ్యాయులు ఫణేంద్రకుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లెళ్ళమూడిలో పౌష్టికాహార పక్షోత్సవాలు

బాపట్ల, మార్చి 13: మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో తృణధాన్యాల ప్రాముఖ్యతను విద్యార్థుల తల్లులకు వివరించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొద లగువాటిని రోజు మనం తీసుకోవటం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఆకుకూరలు, పండ్లు ఆరోగ్యానికి కలిగించే మేలు గురించి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్.రాములమ్మ, శ్రీలక్ష్మీ, కె.మంగమ్మ, ఎన్ దీప్తి, అలివేలుమంగమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, మార్చి 13 :కర్లపాలెం మండలం పేరలి పడమర గొల్లపాలెంలో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిరుధాన్యాలతో వంటల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎ.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పోషక విలువలు కలిగిన ఆహారం గురించి తెలియ జే స్తూ ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం ప్రియాంక, మహిళా పోలీసు హిమ, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి : సీపీఐ

బాపట్ల, మార్చి 13 : ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి మోసం చేసిన మతోన్మాది నరేంద్రమోదీ, ఆంధ్ర నియంత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ కోరారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసపూరిత పథకాలతో తిరిగి అధికారం చేపట్టాలని చూస్తున్నారన్నారు. పోలవరం నిర్మాణం చేయని, విభజనహామీలు అమలు చేయని, ప్రత్యేకహోదా కల్పించని మోదీ ఆంధ్రలో అడుగుపెట్టే అర్హతలేదన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అప్పులపాలు చేసి అభివృద్ధిని మరిచిన జగన్‌కు ఓటు అడిగే అర్హతలేదన్నారు. సీనియర్ నాయకులు మామిడి బత్తుల అశోక్, కంచర్ల ఏసురత్నం, కోకి దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

షామియానా లైసెన్స్ పొందేందుకు బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం, మార్చి 13 : మండలపరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి చెందిన కల్యాణ మండపంలో జరిగే వివిధ శుభకార్యాలకు అవసరమైన షామియానాలు, కుర్చీలు సప్లై చేయుటకు లైసెన్స్ పొందుటకు బహిరంగవేలం బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో బాపట్ల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ అధ్యక్షుడు మోదుగుల ప్రభాకరరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ వేలంలో హెచ్చుపాటదారుడిగా కుంచల జయరెడ్డి రూ.68వేలకు లైసెన్స్ పొందారు. కార్యక్ర మంలో పిట్టలవానిపాలెం మండల వైసీపీ కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాస రెడ్డి, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, మార్చి 13: మండలపరిధిలోని కోడూరులో మండలపరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలను ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంఈవో-1 మాట్లాడు తూ పాఠశాలలోని విద్యార్థులకు అంకితభావనతో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయురాలు గౌహర్ జహ, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ మాజీ కోఆప్షన్ సభ్యులకు సన్మానం

కర్లపాలెం, మార్చి 13 : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమా, షేక్ హస్సన్‌బాషా, కర్లపాలెం పంచాయతీ మాజీ ఎంపీటీసీలు బెజ్జం వెంకటేశ్వర్లు, షేక్ బాజీ, అంగలకుదురు ప్రకాశరావు, కట్టా సుజాతలను బుధవారం దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానం చేసినట్లు ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హబీబ్ పఠాన్, నాగూర్‌ఖాన్, షేక్ జిలానీ, పఠాన్ కరిముల్లాఖాన్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వరికూటికి అభివృద్ధి కనిపించడం లేదా : దేవిరెడ్డి

చుండూరు మార్చి 13 : ఎన్నికల సందర్భంగా వేమూరు నియోజకవర్గానికి వలస వచ్చిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబుకు నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన ఆనందబాబును విమర్శించడం సరికాదని వేమూరు నియోజకవర్గ తెలుగుయువత అధికార ప్రతినిధి దేవిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. చుండూరులో బుధవారం జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనందబాబు మంత్రిగా చేసిన సమయంలో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్య క్రమాలు చేసి చూపించారని, వాటిని ఒకసారి పరిశీలించుకోవాలని, మంత్రిగా పని చేసిన నాగార్జున నియోజకవర్గంలో కనీసం రోడ్డు కూడా వేయలేని దుస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు నాయకులు చొక్కా బుచ్చ య్య, అశోక్, జొన్నకూటి సాంబశివరావు, రెడ్డి సాంబశివరావు, దేవిరెడ్డి సుబ్బారావు, కేలం శ్రీనివాసరావు, యాసం జగదీష్, సుగ్గనబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడాపై అవగాహన

కొల్లూరు, మార్చి 13: పోషణ పక్వాడా కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు అవ గాహన కల్పించారు. బుధవారం కొల్లూరులోని 5వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రం, మండలపరిధిలోని తోకలవానిపాలెం అంగ న్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు చిరుధాన్యాలు అందించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నగరాజకుమారి, కార్యకర్తలు ఆదిలక్ష్మి, శారద, ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పదిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

రేపల్లె, మార్చి 13: రానున్న 10వతరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ వైకిషోర్‌బాబు అన్నారు. పట్టణంలోని త్రిబులెస్ ఉన్నత పాఠశాలలో ఆదర్శవేదిక ఆధ్వర్యంలో 10వతరగతి విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన ప్యాడ్లు, పెన్నులు, స్కేల్, ఎరైజర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం జానీబేగ్, పాఠశాల ఉపాధ్యాయులు వీఎన్‌కే కుమారి, సునీత, దుర్గా, ఆదర్శవేదిక సభ్యులు మోహన్‌రావు, ఎన్ సాయికృష్ణమాచార్యులు, నటరాజ్, సుందరరావు పాల్గొన్నారు.

గోవాడ తిరునాళ్ల ఆదాయం 46 లక్షల 33 వేలు

అమృతలూరు, మార్చి 13: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ బాలకోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల ఆదాయం 46,33,467 వచ్చింది. గత ఏడాది కన్నా 8,78,220 ఆదాయం తగ్గింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, సభ్యులు, దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు, గ్రామస్థుల సమక్షంలో సిబ్బంది హుండీ లెక్కింపు చేపట్టారు. గత ఏడాది రూ.55,11,687 వచ్చిందని సీఎఫ్‌వో అమర్‌నాథ్ తెలిపారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ ఈవో అశోక్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణవెంకట శ్రీనివాసశర్మ, శ్రీధర్‌శర్మలు గ్రామస్థులు, పర్యవేక్షించారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు వారు తెలిపారు.

విద్యుదాఘాతానికి రేకుల ఇల్లు దగ్ధం

కొల్లూరు, మార్చి 13: విద్యుదాఘాతం కారణంగా రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు బోసునగర్‌కు చెందిన సబావత్ దుర్గమ్మ, రాములు నాయక్‌లకు చెందిన రేకుల ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న వంట సామగ్రితో పాటు దుస్తులు ఇతర విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖాధికారులు శకటంతో వచ్చి ఇంట్లోని మంటలను ఆపి వేశారు. పీఆర్‌వో రవికుమార్ ఘటనా స్థలాని కి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లుగా అంచనా వేశారు.

యువకుడి ఫిర్యాదుపై కేసు

కొల్లూరు, మార్చి 13 : అకారణంగా తనపై దాడి చేశారంటూ ఓ యువకుడు చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు బుధవారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ రాత్రి కొల్లూరులో తిరునాళ్ల పురస్కరించుకుని రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణ లో గాజుల్లంక గ్రామానికి చెందిన సనకా సాంబయ్యనాయుడు వ్యక్తిగత పనులపై కారులో వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనం తగలబడటంతో కారు దిగి నడుచుకుంటూ లాకు సెంటర్ వైపు వెళుతుండగా కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన కనపాల చందు అతని సోదరుడు కనపాల రాజేంద్ర, వెంకటేష్, చొప్పర వంశీ, రాఘవ, కూచిపూడి జగదీష్, సుష్మ, తేజ, చంద్రశేఖర్, నానిలతో పాటు మరికొందరు యువకులు అసభ్య పదజాలం వాడుతూ కులం పేరుతో దూషిస్తూ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదుతో పాటు రోడ్లపై అల్లర్లు సృష్టించి ఓ ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేయడంతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం కృషి

వేమూరు, మార్చి 13: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి, చేయూత పథకం ద్వారా మహిళలకు తోడ్పాటును అందిస్తున్నారని వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో చేయూత లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చొప్పర కృష్ణ, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల జడ్పీ టీసీలు గాజుల హేమలత, ఉదయ భాస్కరి, చొప్పర సుబ్బారా వు, ఎంపీపీలు, మార్కెట్ యార్డు చైర్మన్ ఉప్పు శిరీష, సర్పంచ్ సజ్జ శ్రీలక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ఆనందబాబు పరామర్శ

భట్టిప్రోలు, మార్చి 13: మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కర్రా ప్రసాదరావు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బుధవారం కర్రా ప్రసాదరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా ఐలవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కొడాలి వెంకట సత్యనారాయణ సంస్మరణ సభలో ఆనందబాబు పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సీనియర్ నాయకులు ఈడె నాగేశ్వరరావు కుమారుడు ఈడె శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. కుటుంబా న్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. గ్రామానికి చెందిన సమ్మెట చెన్నయ్య భార్య కృష్ణవేణి ఇటీవల మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. సీనియర్ నాయకులు శొంఠి గోపి కుమారుడు శొంఠి దిలీప్ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందగా ఆనందబాబు పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రసాదరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

మంత్రి నిర్లక్ష్యంతో కమ్యూనిటీ భవనాల నిధులు వెనక్కి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు, మార్చి 13: బీసీ కమ్యూనిటీ భవనాలకు కేటాయించిన రూ.32 లక్షల నిధులు మంత్రి నాగార్జున నిర్లక్ష్యం కారణంగా రద్దు కాబడ్డాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలులో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు రూ.32 లక్షలు నిధులు విడుదల చేయించారన్నారు. 2019 సాధారణ ఎన్నికల ముందు సాంకేతిక కారణాల దృష్ట్యా కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు పెండింగ్ పడ్డాయన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మంత్రి నాగార్జున సదరు నిర్మాణాలపై దృష్టి చూపలేదని ఆరోపించారు. మంత్రి నాగార్జున నిర్లక్ష్యం కారణంగా యాదవ, పద్మశాలీయ, గౌడ, రజక కులాలకు మంజూరైన కమ్యూనిటీ భవనాలు రద్దయ్యాయని, ఇప్పటికైనా నమ్మక ద్రోహం చేసిన వారెవరో ప్రజలు తెలుసుకోవాలన్నారు. గ్రామాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసిన ఆనందబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి తరపున ప్రచారం

కొల్లూరు, మార్చి 13 : వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసే న ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరపున టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. బుధవారం తడికలపూడి, జువ్వలపాలెం పరిధిలోని గుంటూరు గూడెం, కొత్తగూడెం కాలనీల్లో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్‌లు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేయాలని కోరుతూ బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేములపల్లి మోహనకృష్ణ, యలవర్తి కోటేశ్వరరావు, కాట్రగడ్డ హరిబాబు, ముమ్మనేని శివన్నారాయణ, సుంకర శ్రీను, జీఎల్‌జి భగవాన్, గుమ్మడి సాంబశివరావు, దివి సీతారామయ్య, రావుల రమేష్, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, గొరికపూడి ప్రసాద్, కాసరనేని మోహన్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తడికలపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వెల్లటూరులో టీడీపీ పథకాలపై...

భట్టిప్రోలు, మార్చి 13 : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ నినాదంతో సూపర్ 6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వెల్లటూరు క్లస్టర్ పరిధిలోని వెల్లటూరు గ్రామంలో క్లస్టర్ చైర్మన్ మోటూరు పుణ్య శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు గెలుపును కాంక్షిస్తూ గ్రామంలో గడపగడప కు వెళ్లి సూపర్ 6 పథకాలను ప్రజలకు తెలియజేశారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రూ.3 వేలు నిరుద్యోగభృతి, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం, ప్రతి మహిళకి నెలకు రూ.1,500లు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వాకా వెంకటనారాయణ, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు వేముపల్లి జగన్నాథరావు, నూతక్కి దినకర్‌బాబు, బట్టు మల్లికార్జునరావు, రాయన ప్రసాద్, వాకా శ్రీనివాసరావు, గుంటూరు దాసు, కేతావత్ రమేష్, రావూరి వరప్రసాద్, క్రాప రవికుమార్, వరికూటి ప్రసాద్, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీర్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, మార్చి 13: పురపాలక సంఘంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం చేయాలని, కనీస వేతనాలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం రేపల్లె సీఐటీయూ కార్యాలయంలో పురపాలక సంఘం ఇంజనీర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీర్ కార్మికులు అనేక సంవత్సరాలు పనిచేస్తున్నప్పటికి ప్రభుత్వం సరైన వేతనాలు అమలు చేయకపోవటం వల్ల నష్టపోతున్నారన్నారు. కనీస వేతనం రూ. 24 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ మణిలాల్, వి.ప్రభాకరరావు, ఎన్ రవిబాబు, కె.రాఘవేంద్రరావు, బి.యువరాజు, వి.శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

సావిత్రి గణేష్ పాఠశాలకు ఆర్థిక సాయం

రేపల్లె, మార్చి 13: మండలంలోని వడ్డివారిపాలెంలో శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెం దిన సుఖీభవంతు ట్రస్టు సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయుల కు రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యు లు రత్నప్రభ మాట్లాడుతూ మహానటి సావిత్రి నిర్మించిన ఈ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు ఎదగటం అభినందనీయమన్నారు. అలాంటి పాఠశాలకు తమ వంతు సహాయ, సహకారాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాధవి, ట్రస్టు సభ్యులు రవిప్రసాద్, నారాయణశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా ఉపకరణాలకు నగదు అందజేత

అమృతలూరు, మార్చి 13: స్థానిక ఉత్తర ఎస్సీ కాలనీకి చెందిన నవభారత్ యూత్ సభ్యులకు క్రీడా ఉపకరణాల నిమిత్తం దాత బుధవారం రాత్రి నగదు అందజేశారు. గ్రామానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు ఆర్థిక సహకారంతో రూ.20 వేల నగదును ఎన్నారై క్రొత్తపల్లి రామకృష్ణ చేతుల మీదగా యూత్ సభ్యలకు అందించారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, మట్లపూడి జయపాల్, రాపర్ల వెంకట సూర్యనారా యణ, నార్ల శ్రీను పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

కర్లపాలెం, మార్చి 13: కర్లపాలెంకు చెందిన బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ఇటీవల కాలంలో సర్జరీ చేయించుకోవడంతో ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 32,000 రూపాయలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసినట్లు తెలిపారు.

చేరికలతో తెలుగుదేశం పార్టీలో జోష్

కొత్తపాలెం, మున్నంవారిపాలెం, రాజు బంగారు పాలెం నుంచి భారీగా వలసలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 13: తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం జోరందుకుంది. రోజు రోజుకు పార్టీలోకి చేరికలు కొనసాగుతుండటంతో పార్టీలో జోష్ నెలకొంది. బుధవారం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చిన్నగంజాం మండల పరిధిలోని కొత్తపాలెం, మున్నంవారిపాలెం, రాజు బంగారు పాలెం గ్రామాల నుంచి 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఏలూరి సాదరంగా అహ్వానించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోకి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన అక్కల చెన్నారెడ్డి, బక్క వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు 50 కుంటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా మున్నంవారి పాలెం గ్రామానికి చెందిన బక్క నరేందర్ రెడ్డి, బాగిరెడ్డి, కోటిరెడ్డిలతోపాటు 10 కుంటుంబాలు పార్టీలోకి చేరారు. రాజు బంగారుపాలెంకు చెందిన అట్ల చిన్న నర్సింహారెడ్డి ఆట్ల వెంకటేశ్వర్‌రెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో 40 కుంటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు.



తెలుగుదేశం పార్టీలోకి చేరిన చిన్నగంజాం మండల వాసులతో ఎమ్మెల్యే ఏలూరి

నియోజకవర్గ సమగ్ర అభివృద్దే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నా లక్ష్యమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని 5 ఏళ్లలో చేసి చూపించానన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా చిన్నగంజాం ఉందన్నారు. సరైన మౌలిక వసతులు లేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రహదారులు, మంచినీరు, డ్రైన్లు, ఇళ్లలేక చదువుకున్న యువతకు ఉపాధి ఉద్యోగం లేక తీవ్ర వెనుకబాటుకు గురైందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేసి చూపించి మళ్లీ ఓటు అడిగానని గుర్తు చేశారు. 2014-19 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధి మినహా తరువాత ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. చినగంజాం మండల ప్రజల దశాబ్దాల కల ఎన్టీఆర్ వారధిని నిర్మించి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారని ఏలూరి అన్నారు. రానున్న కాలంలో మండలంలో ఉన్న సమస్యలను అన్నింటిని పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. వైఎస్ జగన్ పాలనలో అరాచక విధ్వంస దోపిడీ పాలనకు విసిగి వేసారి అయన సామాజిక వర్గానికి చెందిన 100 కుంటుంబాలు తనపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరటం రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ సరైన నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి బాటలు వేసే చంద్రబాబు వైపు అడుగులు వేయాలన్నారు. ప్రజల కల నెరవేర్చడమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యం అన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పొద వీరయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీ, అనోది సుబ్బారెడ్డి, జాలి రామిరెడ్డి, వాటుపల్లి కొండలు, నక్కల రాఘవ, బత్తుల శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి13: పరిపాలన అంటే సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా ఉండాలని, వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని క్లస్టర్ 8 పరిధిలో 152, 153,155, 161, 162,163, 164, 165, 166, 167, 171, 172, 173, 174, 175, 176 బూత్‌ల పరిధిలోని టీడీపీ నేతలు, కౌన్సిలర్‌లు, కార్యకర్తలతో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకు రావాలసిన బాధ్యత ఉందని అన్నారు. మన బిడ్డల, రాష్ట్ర భవిష్యత్ కోసం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి కలయిక అన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేశారన్నారు. 28,147 కోట్ల రూపాయల నిధులను దారి మళ్ళించి దళితులకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించే దళితులను ఊచకోత కోస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. 6 వేల మంది దళితులపై అక్రమ కేసులు పెట్టి 21 మందిని హత్య చేసిన జగన్ ప్రభుత్వంపై జుడిషియల్ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారని రవికుమార్ చెప్పారు. వైసీపీ తప్పులను ప్రశ్నించినందుకు మహాసేన రాజేష్‌ని వేధింపులకు గురిచేశారన్నారు. వైసీపీని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో దళితుల అభివృద్ధి జరిగిందని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వేలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించటం జరిగిందని అన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగన్ తన పేరు పెట్టుకోవటానికి సిగ్గులేదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు గౌరవంగా బతకాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ సర్కారు రద్దు చేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధస్తామని ఆయన వివరించారు. మద్యం రాబడిని ఆదాయంగా చూపించుకొని అప్పులు తెచ్చుకోవటమే మద్యపాన నిషేధమా అని ప్రశ్నించారు. రెండు దశాబ్దాల తన రాజకీయ చరిత్రలో ఎక్కడా కక్షసాధింపు చర్యలకు పాల్పడ లేదని, భవిష్యత్‌లో కూడా పాల్పడనని రవికుమార్ అన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పింఛన్‌లు, సీఎం సహాయ నిధి, జలసిరి బోర్లు మంజూరు జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రయివేట్ కళాశాలలలో చదివే పీజీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయకపోవటం జగన్‌రెడ్డికి పేదలపై చూపుతున్న కపట ప్రేమకు నిదర్శనం అన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే ఆంక్షలు లేకుండా అన్ని కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింప జేస్తామన్నారు. ఈ సమీక్షలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జి కుందారపు రామారావు, కౌన్సిలర్ లు కంపా రజని, విజయలక్ష్మి, జహీరా, అత్తులూరి రమేష్, లహరి, మన్నెం ఏడుకొండలు, భోజనపల్లి సత్యనారాయణ, గుంజి శ్రీనివాసరావు, యర్రాకుల రామాంజనేయులు, బిళ్ళపాటి రామాంజనేయులు, గట్టుపల్లి రామారావు, కమ్మిశెట్టి శ్రీధర్, వడిగినేని వీరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి పట్టణ వార్డు కౌన్సిలర్‌లు, నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన అనమనమూరు వైసీపీ నేతలు

టీడీపీలో చేరిన అనమనమూరు వైసీపీ నేతలు

మేదరమెట్ల , మార్చి 13: కొరిశపాడు మండలం అనమనమూరుకు చెందిన పలువురు వైసీపీ నేతలు అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం వల్లెపు శ్రీను(డాన్‌శ్రీను) ఆధ్వర్యంలో వల్లెపు వెంకట్రావు, కుంచాల శ్రీను, వల్లెపు అనిల్, వల్లెపు శ్రీనివాసరావు, తమ్మిశెట్టి శ్రీను, రమేష్, కొండలుతో పాటు పలువురు జన్నతాళిలోని ఎమ్మెల్యే రవికుమార్ క్యాంప్ ఆఫీస్‌లో ఆయనను కలిసి టీడీపీలో చేరారు. ఇటీవల మండలంలోని పలువురు వైసీపీ నేతలు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు.అద్దంకి వైసీపీ ఇచ్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతల నుంచి తప్పించడంతో ఆయన అనుచరులు అందరూ తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. వీరందరిని రవికుమార్ సాదరంగా ఆహ్వానిస్తున్నారు.



గ్రానైట్ ఫ్యాక్టరీలలో సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బందితో సర్వే చేస్తున్న జిల్లా పరిశ్రమల అధికారి

గ్రానైట్ పరిశ్రమలపై సర్వే

బల్లికురవ. మార్చి 13 : గ్రానైట్ పరిశ్రమలపై జిల్లా పరిశ్రమల అధికారి ఉమాశంకర్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేపట్టారు. బల్లికురవ మండలంలో ఉన్న అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీల వివరాలను సేకరించేందుకు సచివాలయ అసిస్టెంట్ల సహకారంతో ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఫ్యాక్టరీ యజమాని కులం పేరు, పరిశ్రమ పేరు, ఎంత ఖర్చు చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఎంత ఇచ్చింది వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈసర్వేపై కూడా గ్రానైట్ యజమానులలో తీవ్ర ఆందోళన మెదలైంది. గతంలోనే పరిశ్రమల వివరాలు అధికారుల వద్ద ఉన్నాయని, ఇప్పుడు సర్వే చేపట్టటం ఎమిటని వారు అంటున్నారు. మరో నాలుగు రోజుల పాటు అన్ని ఫ్యాక్టరీలలలో సర్వే కార్యక్రమం జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మహిళలకు బ్యూటీషన్‌పై ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, మార్చి 13: గ్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు బ్యూటీషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. దీనిపై బుధవారం అద్దంకిలో ఎస్‌జీహెచ్ మహిళలకు అవగాహన కల్పించారు. 15 రోజుల ఉచిత శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, పదో తరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం అద్దంకి, మేదరమెట్ల, ముప్పవరం గ్రామాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీపీఎం జి. శరత్‌బాబు, షరీఫ్, మహిళలు పాల్గొన్నారు.

చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే బలరాం

చీరాల,మార్చి 13 : నియోజకవర్గంలో అన్ని అన్ని వర్గాల అభ్యున్నతి, మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో వారు పాల్గొన్నారు. మసీదు సెంటర్లో రూ.90 లక్షల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్, శ్లాబ్ కల్వర్టు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులను బుధవారం వారు ప్రారంభించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్(బస్సులు డిపోలోకి వెళ్లేదారి) అప్రోచ్ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ప్రజల మనస్సులు తెలుసుకుని, అందుకు అనుగుణంగా వారికి సేవలు అందించాలని చెప్పారు. అదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, డాక్టర్ వరికూటి అమృతపాణి, మల్లెల లలితరాజశేఖర్, యాతం మేరీబాబు, శిఖా సురేష్, చీమకుర్తి బాలకృష్ణ, సల్లూరి అనిల్, కోఆప్షన్ సభ్యులు షేక్ హుమాయూన్ కబీర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ తదితరులు

రూ.11.99 కోట్లతో అభివృద్ధి పనులు

గడిచిన ఐదేళ్ల కాలంలో కొత్తపేట పంచాయతీ పరిధిలో రూ.11.99 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ నియోజవకర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. అందులో భాగంగా బుధవారం తాజాగా రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన పార్కును, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని ప్రారంభించారు. అలాగే చీరాల మండలం రామకృష్ణాపురంలో రూ.9లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ భవనం పై అంతస్తును ప్రారంభించారు. రూ.1.96 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హైమా సుబ్బారావు(గుంటుపల్లి సుబ్బారావు), దివి జయరాం, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య

రాష్ట్ర పురోగమనం చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య

వేటపాలెం(చీరాల),మార్చి13 : తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని, పురోగమనంలోకి అడుగులు వేయించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రిక అవసరం ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. రామన్నపేట పంచాయతీ దంతంవారి కల్యాణ మండపంలో బుధవారం రాత్రి జయహో బీసీ క్లస్టర్ 10 యూనిట్స్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికారుల శిక్షణ సమావేశం జరిగింది. సమావేశానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలుపరుస్తారన్నారు. వాటికి సంబంధించిన ప్రయోజనాలను వివరించారు. శ్రేణుల సందేహాలను నివృత్తి చేశారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బొగ్గుల పార్థసారథి, నాసిక వీరభద్రయ్య, షేక్ సుభాని, కౌతవరపు జనార్ధనరావు, గుత్తి వీరప్రసాదరావు, చింతా రామకృష్ణారావు, ఉమ్మిటి శంకరరావు, జాగాబత్తుని పోతురాజు, పింజల రేణుకేశ్వరరావు,షేక్ అజీమ్, యర్రా శివనాగమల్లేశ్వరి, బిట్ర చైతన్యకుమార్, ఉసురుపాటి సురేష్, గంజి పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ హుండీ ఆదాయం రూ. 21.66 లక్షలు

అద్దంకి, మార్చి13: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీల కానుకల ద్వారా 21,66,561 రూపాయల ఆదాయం వచ్చింది. హుండీల కానుకల ను బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, పంగులూరు గ్రూపు దేవస్థానాల ఈవో శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగింది. డిసెంబరు 13 వ తేదీ నుంచి బుధవారం వరకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించారు. విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్లు 15, ఇంగ్లాండ్ పౌండ్స్ 120 వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

వంట సామగ్రి ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకు..

శింగరకొండ దేవస్థానం అన్నదానం కిచెన్ ఐటమ్స్, బాయిలర్స్ ఇతర సామాగ్రిని 10 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు ఎస్‌బీఐ అధికారులు ముందుకు వచ్చివర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

ఇంకొల్లు,మార్చి 13: రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు పోలీసులు తమ వంతు సహకారం ఉంటుందని ఇంకొల్లు ఎస్సై మల్లికార్జునరావు అన్నారు.బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం ఇంకొల్లు ప్రధాన వీధుల్లో బీఎస్‌ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బందితో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమవంతు సహకారం ఉంటుందన్నారు.ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.ఈ ర్యాలీలో ఇంకొల్లు ఎస్సై మల్లికార్జునరావుతో పాటు ఇంకొల్లు పోలీసులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కవయిత్రి మొల్లమాంబ జయంతి

అద్దంకిటౌన్, మార్చి 13: శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని శాలివాహన కుమ్మర్ల అన్నదాన సత్రంలో బుధవారం శాలివాహన తొలి అడపడుచు, తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అన్నదాన సత్రంలోని ఆమె విగ్రహానికి సత్రం కమిటీ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ అధ్యక్షుడు కొడిమెల వెంకటేశ్వర్లు, పొరెళ్ల బ్రహ్మయ్య కోశాధికారి కొరపాటి ఏడుకొండలు, గురునాథం, వీరాస్వామి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఆర్థిక సహాయం అందజేత

ఇంకొల్లు,మార్చి 13: ఇంకొల్లు స్టాలిన్‌పేటకు చెందిన వల్లపాటి సురేష్ కుమారుడు ఆశిష్‌కు స్పైనల్ ఆపరేషన్‌కు మండల తెలుగుదేశంపార్టీ నాయకులు,ఇంకొల్లు మాజీ సర్పంచ్ డాక్టరు బోడాల శ్యాంసుందర్ సహకారంతో నాయకులు ఎద్లూరి దాసు ఆ కుటుంబసభ్యులకు బుధవారం రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. .ఈ కార్యక్రమంలో పి.రామారావు,పి.ఇమ్మానుయేల్, వి.బూను,వి.విజయరాజు,మహిళా నాయకులు వి.మమతా,పి.సుధీర్, స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

చినగంజాం, మార్చి 13 : కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన సూరగాని గోపినాథ్ జ్ఞాపకార్థం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఆయన సోదరుడు రామకృష్ణ, స్నేహితులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఎ.హరిబాబు, ఆర్.కే.నాయుడు, తోట అశోకచక్రవర్తి, యశ్వంత్, వై.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చీరాల,మార్చి 13 : వాసవి క్లబ్, వనిత చీరాల నూతన కార్యకర్త ప్రమాణ స్వీకారం గురువారం సాయంత్ర 6.30 గంటలకు ముంతావారి సెంటర్లోని ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జెఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ప్రతినిధులు, సభ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

82 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చినగంజాం, మార్చి 13 : మండలంలోని మోటుపల్లి గ్రామం నుంచి ఎన్.హెచ్.16కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కడవకుదురు గ్రామ శివారులో సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం మోటుపల్లి గ్రామం నుంచి ఎన్.హెచ్.16కు తరలిస్తున్న 82 బస్తాలను(50కిలోలు) కడవకుదురు గ్రామ శివారులో అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. మినీ టాటా ఏసీ వాహనంలో తరలిస్తున్న పీ.డీ.ఎస్. బియ్యాన్ని పట్టుకొని, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. మోటుపల్లి చెందిన సుంకర వెంకటరావు ఆదేశాల మేరకు మోటుపల్లి నుంచి ఎన్.హెచ్.16 ప్రాంతానికి పీడీఎస్ బియ్యాన్ని తీసుకొని వెళ్తున్నట్లు వాహనం డ్రైవర్ షేక్ నాగుర్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టాటా ఏసీ మినీలారీ డ్రైవర్ షేక్.నాగుర్, సుంకర వెంకటరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఇంకొల్లు సర్పంచ్‌పై విచారణ

ఇంకొల్లు,మార్చి 13: ఇంకొల్లు సర్పంచ్ ఏజర్ల ప్రసన్నపై గతంలో వచ్చిన వివిధ అభియోగాలపై కలెక్టరు ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీన బాపట్ల జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్లు ఈవోఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలో సర్పంచ్ ప్రసన్న సంతకాల ఫోర్జరీ చేయడం,ఉన్నతాధికారుల ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం,సుమారు రూ. కోటి 70లక్షల నిధుల దుర్వినియోగంపై 3 నెలల పాటు చెక్‌పవర్ రద్దు చేయగా ఈ అంశాలపై వచ్చిన అభియోగాలపై తిరిగి విచారణ చేయనున్నట్లు తెలిపారు.ఈ విచారణలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి రాంబాబు, చీరాల డివిజనల్ పంచాయతీ అధికారి పాల్గొంటారని, ఆ సమయంలో బాధ్యులైన అధికారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్తు

చినగంజాం, మార్చి 13 : ప్రభుత్వం వ్యవసాయ రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ని అందిస్తుందని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ శాఖ ఏఈఈ వి.గణనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సబ్ స్టేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఎంపీపీ అన్నారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు ఆసోది వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వై.తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలి

తోటవారిపాలెం(చీరాలటౌన్), మార్చి 13 : గర్భిణులు పోషకాహారంతో మంచి ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోటవారిపాలెంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు విశేషంగా హాజరై ఆరోగ్య సూత్రాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా తృణధాన్యాలతో చేసిన వంటకాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు.



కారంచేడు జగనన్న కాలనీలో తాగిపడేసిన కర్ణాటక మద్యం బ్రాండ్ల కవర్లు (ఇన్‌సెట్లో) ఇన్‌సెట్‌లో కర్ణాటక మద్యం సీసా

కారంచేడులో కర్ణాటక మద్యం

● భారీగా చేరిందని ప్రజల్లో జోరుగా చర్చ

కారంచేడు(పర్చూరు), మార్చి 13: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బ్రాండ్లు కారంచేడులో దర్శనమిస్తున్నాయి. కుప్పలు తెప్పలుగా తాగి పడేసిన బాటిళ్లు దర్శనమివ్వటంతో భారీగా కర్ణాటక మద్యం కారంచేడుకు చేరిందన్న చర్చ జోరుగా సాగుతుంది. బుధవారం కారంచేడు జగనన్న కాలనీలో తాగి పడేసిన ఆ రాష్ట్ర మద్యం బ్రాండ్ సిల్వర్ కప్ తాలూకు 90 ఎంఎల్ ప్యాకెట్‌లు మీడియా కంటపడ్డాయి. దీంతో కర్ణాటక మద్యాన్ని భారీగా కారంచేడు తెచ్చారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బ్రాండ్లు విచ్చలవిడిగా కంట పడటం సర్వత్రా చర్చగా మారింది. ఇప్పటికే గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్న తరుణంలో ఇలా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం కూడా వస్తున్నట్లు కనిపించటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జోరుగా అక్రమ మద్యం విక్రయాలు కుటీర పరిశ్రమలుగా సాగుతున్నా పట్టించుకోని సెబ్, పోలీసు అధికారులు ఇతర రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

అద్దంకి, మార్చి13: మోటార్‌సైకిల్ ఢీ కొనటంతో వాకింగ్ చేస్తున్న వృద్ధుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న వేలమూరిపాడుకు చెందిన తొట్టెంపూడి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం రామ్‌నగర్ సెంటర్ నుంచి నాగులపాడు రోడ్డు వైపు వాకింగ్ వెళ్తుండగా నాగులపాడు వైపు నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనం లో స్థానిక ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువకుడు శివయ్య మద్యం మత్తులో వేగంగా వచ్చి వృద్ధుడిని ఢీ కొట్టడంతో పాటు సమీపంలో నిలిపి ఉన్న మరో రెండు మోటార్‌సైకిళ్లనూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివయ్యకు కూడా గాయాలు కావటంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, మార్చి13: అద్దంకి పట్టణంలో చేపడుతున్న విద్యుత్‌లైన్‌ల అభివృద్ధి పనులలో భాగంగా గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు దక్షిణ అద్దంకి పరిధిలోని వాసవినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు.

నేడు జనసేనపార్టీ ఆవిర్భావ వేడుకలు

వేటపాలెం(చీరాల),మార్చి 13 : మండలంలోని దేశాయిపేట జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసేనతో పాటు, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.